విశేష అలంకరణలో కట్టమైసమ్మ



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీకట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాత ధర్మారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ వివేక్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, అన్నదాన ఏర్పాట్లు చేశారు.

మేయర్‌కు ఆహ్వానం



నిజాంపేట్: కార్పొరేటర్ రవికిరణ్‌స్వామి ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే అయ్యప్ప మహా పడిపూజకు రావాలని మంగళవారం మేయర్ కొలన్ నీలారెడ్డికి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు జగన్‌యాదవ్, దీక్షిత్ గురుస్వాములు ఉన్నారు.

నిత్యాన్న దాతలకు సన్మానం



దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని శ్రీఅశ్రిత వత్సల అయ్యప్ప దేవాలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. 41 రోజుల పాటు దీక్ష తీసుకున్న అయ్యప్ప స్వాములకు నిత్యం అన్నదానం చేస్తున్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా మత్స్యకారుల సహకార సంఘం చైర్మన్ మన్నే రాజు, భౌరంపేట గ్రామానికి చెందిన ఆర్కెల సురేష్‌గౌడ్ అన్నదానం ఏర్పాటు చేయగా ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

భూ పరిరక్షణే ధ్యేయం..!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యూహంతో ముందు కెళ్లాలని యోచిస్తోంది. ఈనెల 14న 'యథేచ్ఛగా భూదందా.. సర్కారు భూముల్లో దర్జాగా నిర్మాణాలు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు భూపరిరక్షణ ధ్యేయంగా చర్యలకు సన్నద్ధమవుతోంది.



- జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూమి 5,195 ఎకరాలు
- జిల్లాలో అసైన్డ్ చేసిన భూములు 11,384 ఎకరాలు
- ప్రభుత్వ, అసైన్డ్ భూములపై ఆరా తీస్తున్న రెవెన్యూ శాఖ
- వీఆర్‌ఓ, వీఏఓలు లేక ప్రభుత్వ భూములపై తప్పిన పట్టు
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై అధికార యంత్రాంగం యోచన

సాక్షి,మేడ్చల్‌జిల్లా: క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా నిలిచి వాటి ఆక్రమణలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేసే వీఆర్‌ఓ, వీఏఓల వ్యవస్థను గత ప్రభుత్వం సంబంధిత శాఖ నుంచి తప్పించింది. ఆ తర్వాత ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. దీంతో భూ పరిరక్షణ రెవెన్యూ శాఖకు ఇబ్బందికరంగా మారింది. గతంలో ప్రతి మండల పరిధిలో వీఆర్‌ఓ, వీఏఓలు కనీసంగా 100మంది వరకు ఉండేవారు. వారు రెవెన్యూ శాఖ విధుల నిర్వహణలో చేదోడు వాదోడుగా ఉండేవారు. ప్రస్తుతం వీరందరిని ఇతర శాఖల్లోకి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్చటం వల్ల రెవెన్యూ శాఖకు ప్రభుత్వ భూముల రక్షణ సమస్యగా తయారైంది.

◆ దీంతో జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు అందినా.. మండలం పరిధిలో ఉన్న కొద్దిపాటి రెవెన్యూ ఉద్యోగులు పోలీసుల సహకారంతో చర్యలు తీసుకోవటం.. మినహాయించి ఏమి చేయలేని నిస్సహాయత దాపురించింది. భూరక్షణకు పోలీసుల సహకారం తీసుకుందామన్న వారు ప్రతీరోజు ఏదో అధికారిక కార్యక్రమాల పేరుతో బందోబస్తులో ఉంటున్నామని బదులివ్వడంతో సకాలంలో భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోలేకపోతున్నట్లు రెవెన్యూ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ జిల్లా అధికార యంత్రాంగం మాత్రం ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణకు ప్రత్యేక వ్యూహంతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు వైపు చూస్తోంది.

భూముల గుర్తింపు టాస్క్‌ఫోర్స్‌పై బాధ్యత.!

◆ జిల్లాలో 15 మండలాల పరిధిలో గతంలో గుర్తించిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను మరోసారి పరిశీలించి వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని యంత్రాంగం భావిస్తోంది. భూకబ్జాల్లో రాజకీయ పార్టీ నేతలతో పాటు పలువురి ప్రజాప్రతినిధులు ప్రమేయం ఉండగా... కొందరి ఉద్యోగుల సహకారం కూడా ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం గట్టి నిర్ణయంతో పాటు శాఖపరమైన క్రమ శిక్షణ చర్యలకు ఉపక్రమించాలని భావిస్తోంది.

◆ ప్రభుత్వ, అసైన్డ్ భూములను సంరక్షించే బాధ్యత ఆర్‌ఐ, డీటీ, తహసీల్దార్లపైనే ఉందన్న హుకుం జారీ చేసిన యంత్రాంగం రెవెన్యూ శాఖ స్థాయిల్లో టాస్క్ ఫోర్స్ టీమ్‌లను నియమిస్తే ఎలా ఉంటుందని ఆరా తీస్తోంది. అలాగే, గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రహరీ గోడలు, ఫెన్సింగ్ వంటి రక్షక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది.

ప్రభుత్వ సంరక్షణలో ఎంత భూమి ఉందో చెప్పని అధికారులు...

◆ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 11 మండలాల పరిధిలో దాదాపు 269 సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ శాఖ... అందులో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి. ఎంత సంరక్షణలో ఉందన్న సమాచారాన్ని మాత్రం చెప్పలేకపోతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలుస్తోంది.

◆ శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్‌కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డుల్లో పేర్కొంది.

జిల్లాలో అసైన్డ్ భూములూ ఎక్కువే...

◆ జిల్లాలో 2004సంవత్సరం వరకు 116 రెవెన్యూ గ్రామాలు, బస్తీల పరిధిలో 8,230 మంది పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ లబ్ధిదారులకు 11,384ఎకరాల ప్రభుత్వ భూములను అసైన్డ్ చేశారు. ఈ అసైన్డ్ భూములన్నీ వ్యవసాయ పంట సాగు, ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మండలంలోని 17గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలంలోని 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలంలోని 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలంలోని 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 855 ఎకరాల అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం హయాంలో రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. అదులో 30శాతం వరకు వెంచర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్టుమెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రులుగా మారినట్లు తెలుస్తోంది.

అడ్వకేట్‌నే బురిడీ కొట్టించిన ఘనుడు

- ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో డబ్బులు వసూలు
- ముఖం చాటేయడంతో పోలీసులకు ఫిర్యాదు

జగద్గిరిగుట్ట: పరిశ్రమలో ఇన్‌వెస్ట్‌మెంట్ పేరిట నమ్మబలికి ఓ వ్యక్తిని బురిడీ కొట్టించిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పీఎస్ పరిధి ఆల్విన్ కాలనీలోని సాయిబాబా ఆలయం సమీపంలో నివసించే భీమయ్య అడ్వకేట్‌గా పని చేస్తున్నాడు. కాగా ఇతనికి తెలిసిన వ్యక్తి ద్వారా నగరంలోని వనస్థలిపురానికి చెందిన రమేష్ పరిచయమయ్యాడు.

◆ తాను వనస్థలిపురంలో త్వనిత ఆయుర్వేదిక్ డెవలపర్స్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాని.. అనేక పరిశ్రమలు ఉన్నాయని నమ్మబలికాడు. తన పరిశ్రమల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో ఇది నిజమని నమ్మిన భీమయ్య 12 లక్షల 17వేల 600 రూపాయలు ఆన్‌లైన్‌లో, మరో 12 లక్షల 82 వేల 400 రూపాయలు నగదు రూపంలో అందజేశాడు.

◆ ఇన్‌వెస్ట్‌మెంట్ డబ్బులు ఇచ్చేంత వరకు ప్లాట్ ఇస్తానని చెప్పిన రమేష్ అటు ప్లాట్, ఇటు డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా డబ్బులు ఇచ్చే సమయంలో రమేష్‌తో పాటు అతని కుమారుడు క్రాంతి, కోడలు మనోగ్నలు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శుభాకాంక్షలు



దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తెలిపారు. తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కర్ణాటక మంత్రి బోసు రాజు లను వేర్వేరుగా కలిసి అభినందనలు తెలిపారు.

దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రహమాన్

సుభాష్‌నగర్: ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ ఖాన్ అన్నారు. ప్రతి రోజు కార్యాలయం ఆవరణలో దరఖాస్తుదారులకు కాసేపు సమయం కేటాయించి వారి మాట్లాడుతున్నారు. వారు వచ్చే పనులపై సంబంధిత అధికారులను రప్పించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుదారులు పదేపదే కార్యాలయానికి రాకుండా అన్ని పత్రాలు సరిగా ఉంటే తక్షణమే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

19క్యూబీఆర్26పి: దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

నిజాంపేట్: వెంకట్రాయనగర్‌కు చెందిన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వెంగయ్యచౌదరి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట్రాయనగర్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. కాలనీ సభ్యులు రామకృష్ణ, స్వరూప్‌రావు, చందు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో ఓటమితో కార్యకర్తలు అధైర్యపడొద్దు



కుత్బుల్లాపూర్: వందేళ్ల కాంగ్రెస్ పార్టీ అనేక ఆటుపోట్లను ఎదుర్కొందని.. కుత్బుల్లాపూర్‌లో ఓటమితో కార్యకర్తలు అధైర్యపడకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సీనియర్ నాయకుడు కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. తన విజయం కోసం ప్రతి కార్యకర్తల శక్తివంచన లేకుండా పనిచేశారన్నారు. రాష్ట్రంలో మన ప్రభుత్వమే అధికారంలోకి ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోపార్టీ సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే షురూ



పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన యోగేశ్ వాద్వానీ,శివ సిరిపోలు,పీయూష్ గుప్తా

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఎన్‌ఆర్ వీజేఐఈటీ) కళాశాలలో మంగళవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2023 సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే ప్రారంభమైంది. హ్యాకథాన్ గ్రాండ్ పినాలోకే నోడల్ సెంటర్‌గా ఉన్న కళాశాలలో 36 గంటల పాటు కార్యక్రమం నిర్విరామంగా జరుగనుంది.

◆ ఈ ప్రారంభ కార్యక్రమానికి ఐఐసీటీఈ నోడల్ సెంటర్ హెడ్ యోగేశ్ వాద్వానీ, సమన్వయకర్త శివ సిరిపోలు, నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగాకు చెందిన పీయూష్ గుప్తాతో పాటు రూర్కీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, సెంట్రల్ వాటర్ కమిషన్‌లకు చెందిన పలువురు నిపుణులు హాజరయ్యారు.

◆ ఈ హ్యాకథాన్‌లో జల్‌శక్తి మంత్రిత్వశాఖకు సంబంధించిన సమస్యలపై పరిష్కర మార్గాలు రూపొందించడానికి 150 మంది విద్యార్థులు 25 జట్లుగా పాల్గొన్నారని నోడల్ సెంటర్ ఇన్‌చార్జ్ ప్రొ. కౌసర్ నిఖత్, హ్యాకథాన్ సమన్వయకర్త డాక్టర్ సునంద తెలిపారు. వక్తలు మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రపంచంలోనే అత్యంత పెద్ద పోటీ అని పేర్కొన్నారు. ఇటువంటి హ్యాకథాన్లలో విద్యార్థులు పాల్గొని నవకల్పనపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు డాక్టర్ చెన్న కేశవరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మరో ఘటనలో మహిళకు గాయాలు



గోరంట్ల (ఫైల్)

నిజాంపేట్: వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందగా.. మరోఘటనలో మహిళ తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలు నిజాంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లాకు చాకలి గోరంట్ల(40) టైల్స్ పనులు నిర్వహిస్తూ నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీలోని ఓ ప్లాట్‌లో టైల్స్ వేశాడు.అనంతరం నీళ్లు పోసి షైనింగ్ మెషన్‌తో పనులు చేపట్టడాడు. అనంతరం నీళ్లు బయటకి వెళ్లకపోవడంతో చాకలి గోరంట్ల ఇనుప చువ్వతో నీళ్లు వెళ్లేలా చేస్తున్న క్రమంలో కరెంట్ తీగలు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మరో ఘటనలో..

నిజాంపేట్ కొలన్ నారాయణరెడ్డి కాలనీకి చెందిన తేజశ్విని (31) మేడపై బట్టలు ఆరవేయగా గాలికి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో వాటిని ఇనుక రాడ్డుతో తీసేందుకు ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గురై గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

50 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మాజీ సీఎం కేసీఆర్ ప్రశేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకంతో లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో 50 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు పరిచిందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ ఆలస్యమైందన్నారు.

◆ **సెమీ క్రిస్మస్ వేడుకల్లో...**

సుభాష్‌నగర్ డివిజన్ అపురూపకాలనీలోని చర్చ్ ఆఫ్ ఎటర్నల్ లైఫ్‌లో పాస్టర్ లవ్ పాల్, ఉదయ్,కీర్తన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు సురేష్‌రెడ్డి, నదీమ్‌రాయ్, లక్ష్మీనారాయణ, అపురూపకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గణేష్, ప్రధాన కార్యదర్శి వల్లభనేని రమణ, శేషాచారి, శ్యామ్, నాగలక్ష్మి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్వే నంబర్లు మార్చేస్తున్నా పట్టించుకోరా?



గాజులరామారం సర్వే నం.12 వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సుభాష్‌నగర్: కబ్జాదారులు ఇష్టానుసారంగా ప్రభుత్వ సర్వే నంబర్లను మారుస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. మంగళవారం గాజులరామారంలోని సర్వే నం.12లోని ప్రభుత్వ స్థలాన్ని సీపీఐ కార్యదర్శి ఉమామహేష్ ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు సందర్శించారు. అయితే ఓ వ్యక్తి సర్వే నం.12లో బోర్డును తొలగించి సర్వే నం .445గా పేర్కొంటూ ఓ డబ్బాను ఏర్పాటు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే అన్ని సర్వే నంబర్లు మార్చి ప్రభుత్వ భూమినే ఆక్రమించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కబ్జాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి



కూల్చివేతల్లో పాల్గొన్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

- **సాక్షి వరుస కథనాలపై స్పందించిన బాలానగర్ డీసీపీ**
- పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కబ్జాదారులపై ఉన్న కేసులపై ఆరా
- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చర్యలకు ఉపక్రమించిన పోలీసులు

కుత్బుల్లాపూర్: కబ్జాదారులపై ఉచ్చుబిగిస్తోంది. 'సాక్షి'లో వస్తున్న వరుస కథనాలతో బాలానగర్ డీసీపీ ప్రత్యేక దృష్టి సారించారు. గాజుల రామారం సర్వే నం. 307, 329/1, 342లలోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన నిర్మాణాలను ఈనెల 16వ తేదీన కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టగా సుమారు 450 నిర్మాణాలు నేల మట్టం అయ్యాయి. ఇదే విషయంపై కబ్జాదారుల వ్యవహార శైలిపై బాధితులు తమ ఆక్రందనలు వినిపించగా ఈనెల 18న 'కదిలిస్తే కన్నీరే.!'అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది.

◆ అదే విధంగా ఈనెల 19వ తేదీన ×కార్లల్లో కబ్జాదారుల షికార్లు.. రోడ్డు మీద పడ్డ బాధితులు×అనే శీర్షికతో కథనం రావడంతో పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. బాలానగర్ డీసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో మంగళవారం ప్రత్యేక సమావేశమయ్యారు. ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కబ్జాదారుల వివరాలపై ఉన్న కేసులపై ఆరా తీసి మొత్తం 13 మందిపై ఏకంగా 53 కేసులు నమోదు కావడం.. వారిపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకుండా రాజకీయ నాయకులు అడ్డుపడడం తద్వారా వారిపై చర్యలు లేకపోవడంతో యథావిధిగా కబ్జాలు చేస్తూ వచ్చారు.

◆ చివరకు కేసులు నమోదు చేసి పోలీసులు వదిలివేస్తూ వచ్చారు. ఒకటి ఆపై రెండు లేదా మూడు కేసులు నమోదు అయితే వారిపై ×పిడి×కిలి బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. కానీ ఇక్కడ కేవలం కేసులపైనే దృష్టి సారించి వదిలివేస్తూ రావడంతో కబ్జాదారులు మరింత రెచ్చిపోయారు. గతంలో కుల్చివేసిన చోటే మరోసారి భారీ నిర్మాణాలు చేపట్టడంతో తాజాగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో చర్యలకు ఉపక్రమించారు.

◆ గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా తిరిగి అదే పార్టీ అధికారంలో వస్తుందని భావించిన కబ్జాదారులకు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కంగుతిన్నారు. ఇక్కడ అత్యధికంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వ్యక్తులపైనే భూకబ్జా కేసులు నమోదు కావడం విశేషం.

◆ తాజాగా జరిగిన కూల్చివేతల రోజు నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్క కబ్జాదారుడు అటు పోలీసులకు ఇటు స్థానికులకు దొరక్కుండా తప్పించుకుంటూ తిరుగుతున్నారు. ఏది ఏమైనా వీరిని కట్టడి చేస్తే ప్రభుత్వ స్థలాల్లో జరిగే నిర్మాణాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ **పలువురుపై భూకబ్జా కేసులు ...**

భూకబ్జా విషయంలో ఎట్టకేలకు తాజాగా పోలీసులు మరో కేసు నమోదు చేశారు. గతంలో పదుల సంఖ్యలో కేసులు నమోదై ఉన్న భూకబ్జాదారుడు అబిద్‌తో పాటు మురళి, శ్యామ్, రాములపై జగద్గిరిగుట్ట పోలీసులు భూకబ్జాలకు పాల్పడుతూ ప్రభుత్వ స్థలాలను స్వాహా చేస్తున్నారని రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసులు నమోదు అయ్యాయి. అదే విధంగా ఈనెల 16వ తేదీన కూల్చివేతలకు వెళ్లిన అధికారుల విధులకు నగేష్, దుర్గా, జయమ్మ విధులకు ఆటంకం కలిగించినందుకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా వెలసిన డబ్బాల కూల్చివేత



ఆందోళన చేస్తున్న బాధితులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని వార్డు ఆఫీస్ సమీపంలో అక్రమంగా వెలసిన డబ్బాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం కూలిచ్చేసారు. చికెన్ షాపుల వ్యర్థాలను తీసుకెళ్లి వార్డు ఆఫీస్ వెనకాల వేస్తున్నారు. దీంతో ఆ పరిసరాలు దుర్వాసన రావడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారి సంగీత ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తుతో డబ్బాలను కూల్చివేశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డబ్బాలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. విచిత్రమేమిటంటే కూల్చివేసిన డబ్బాలకు ఎదురుగా ఉన్న స్థలంలో కొన్ని రోజులుగా కబ్జా చేస్తూ డబ్బాలు వేస్తున్నారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.



జేసీబీతో డబ్బాలను కూల్చివేస్తూ...

పరిశ్రమల స్థాపనకు సకాలంలో అనుమతులు

- సంబంధిత అధికారులతో సమావేశంలో కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశ్రామికాభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించి టీఎస్- ఐపాస్, టీ ప్రైడ్ కింద అర్హులైన వారికి పరిశ్రమల ఏర్పాటుకు ఆలస్యం చేయకుండా అనుమతులు ఇవ్వాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో టీఎస్-ఐపాస్, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు ఎంతో అనుకూలత ఉందని, పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తుంటారని వారికి అన్ని రకాల అర్హతలు ఉన్నట్లయితే త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. పరిశ్రమ ప్రోత్సాహక కమిటీ ద్వారా జిల్లాలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు సంబంధించి ఆయా శాఖల ద్వారా జారీ చేయాల్సిన అనుమతుల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, సత్వరమే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. టీఎస్ ఐపాస్ కింద పరిశ్రమలకు కావాల్సిన వివిధ అనుమతుల మంజూరు పురోగతిపై సమీక్షించారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ 14 మంది ఎస్సీ పారిశ్రామికవేత్తకు రూ.38,72,528, పదిహేను మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.46,13,992, ఇద్దరు జనరల్ పారిశ్రామికవేత్తలకు రూ.3,54,359 పెట్టుబడి రాయితీ కింద మంజూరీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించటంతో పాటు ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ప్రజలకు సేవ చేయడంలోనే ఎంతో సంతోషం ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ (డీఎం అండ్ హెచ్‌వో) అధికారి డాక్టర్ రఘునాథస్వామితో కలిసి వైద్యశాఖ పనితీరుపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఆరోగ్య శాఖకు సంబంధించి పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ, పల్లె దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలాంటి వైద్యం అందిస్తున్నారనే విషయాలపై ఆయన పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల్లో వైద్యం సరిగ్గా అందడంలేదనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి, వైద్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.